సాక్షి
మెదక్
శుక్రవారం ౹ 2 ౹ ఫిబ్రవరి ౹ 2024



ఆరుతడి.. భలే రాబడి

యాసంగిలో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. మొక్క జొన్న, పొద్దు తిరుగుడు, కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. వివరాలు IIలో ▸



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నర్సాపూర్ మండలం జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వివరాలు IIలో ▸



ప్రజాసేవతోనే గుర్తింపు

గ్రామ పంచాయతీల పాలకమండలి సభ్యుల పదవీకాలం ముగియడంతో జిల్లా వ్యాప్తంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. వివరాలు IIIలో ▸

ఆశ.. నిరాశ!

- జిల్లాకు దక్కని కేంద్రీయ, నవోదయ స్కూళ్లు
- మెడికల్ కళాశాలపైనా స్పష్టత కరువు

భరోసా ఇవ్వని కేంద్ర బడ్జెట్

మెదక్: పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసింది. నూతనంగా ఏర్పాటైన జిల్లాకు కేంద్రీయ విద్యాలయం, నవోదయ పాఠశాల మంజూరైతే ప్రయోజనం చేకూరుతుందని ఆశగా ఎదురు చూసినా ప్రయోజనం దక్కలేదు. అలాగే రైల్వే గేట్లు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి మొండి చెయ్యి చూపారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు నూతనంగా కమిటీలు వేస్తామని పేర్కొన్నారు. కానీ ఇప్పటికే మంజూరైనా కాలేజీకి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు ఉన్నాయా..? ఉంటే నూతనంగా మంజూరైనా కళాశాలల ప్రస్తావన ఎందుకు రాలేదని పలువురు విస్మయానికి గురవుతున్నారు.

సాకారం కానున్న సొంతింటి కల



పర్యాటక అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రస్తావనే రాలేదు. స్లమ్ ఏరియా, అద్దె ఇళ్లలో నివాసం ఉండే పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు వచ్చే ఐదేళ్లలో దేశంలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. కాగా ఇటీవల ప్రజాపాలనలో భాగంగా ఇళ్లు కావాలని జిల్లాలో లక్షకు పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అర్హులను గుర్తించాల్సి ఉంటుంది. కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం ఆవాస్ యోజన పథకంలో ఇళ్లులేని వారికి లబ్ధి చేకూరనుంది.

మత్స్యకార్మికులకు మరింత సాయం

విద్యుత్ బిల్లుల నుంచి పేద మధ్యతరగతి ప్రజలకు విముక్తి కల్పించేందుకు సోలార్ పథకం ప్రవేశపెడతామని చెప్పారు. కాగా జిల్లాలో 2 లక్షల 2 వేల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ఏ ప్రతిపాదికన పేదలకు సబ్సిడీ ఇస్తారనేది తెలియాల్సి ఉంది. పీఎం మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా మత్స్య కార్మికులకు మరింత ఆర్థికసాయం చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 290 మత్స్య సంఘాలు ఉండగా వాటిలో 18,500 మంది సభ్యులు ఉన్నారు. వీటిలో ఇప్పటికే సబ్సిడీతో వాహనాలతో పాటు చేపల చెరువులు తవ్వకునేందుకు ఒక్కో హెక్టార్‌కు రూ.7 లక్షల వరకు నిధులు ఇస్తుండగా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం సబ్సిడీ ఇస్తున్నారు.

అంగన్‌వాడీ, ఆశాలకు ఆరోగ్య లబ్ధి

పిల్లల ఆరోగ్యం కోసం ఇంద్రధనస్సు పథకం ప్రవేశపెడతామని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 6 సంవత్సరాల లోపు పిల్లలు 56,359 మంది ఉన్నారు. సాగు ఉత్పత్తులను నిల్వ చేసేందుకు గిడ్డంగుల నిర్వహణతో పాటు ఆయిల్ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతోమేలు జరుగుతుంది. నేరుగా రైతు పండించిన నూనె గింజల ఉత్పత్తితో తానే స్వయంగా నూనె తయారు చేసుకునే వీలు ఉంటుంది. కానీ ఇది ఏ ప్రతిపాదికన ఇస్తారనేది తెలియాలి. పాడి అభివృద్ధి కోసం రైతులకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతానికి 54,181 పాడి గేదెలు ఉన్నాయి. జిల్లాలోని అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు ఆయుష్మాన్ (ఆరోగ్య) పథకాన్ని వర్తింప జేస్తామన్నారు. కాగా అంగన్‌వాడీ కార్యకర్తలు 1,076 మంది ఉండగా ఆశా కార్యకర్తలు 660 మంది ఉన్నారు. వీరందరికీ ఆర్యోగపరంగా లబ్ధి చేకూరనుంది. ఆదాయపు పన్ను ఇప్పటివరకు రూ. 5 లక్షలు ఉండగా దానిని రూ.7 లక్షలకు పెంచారు.



ఊరట లభించలేదు..



ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఊరట లభించలేదు. గతేడాది ప్రతిపాదించిన కొత్త పన్ను విధానం రూ.7 లక్షలను ఈసారి కొనసాగించారు. పలు సెక్షన్ల కింద మినహాయింపులను అనుమతించే పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పులను ప్రతిపాదించలేదు.

– కృష్ణ, పీఆర్టీయూ జిల్లా జనరల్ సెక్రటరీ

విద్యకు కేటాయిస్తే బాగుండేది



విద్య అనేది ఉమ్మడి జాబితాలోని అంశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలి. నేడు దేశంలో 70 శాతానికి పైగా పేద విద్యార్థులు చదువుకునేది ప్రభుత్వ బడుల్లోనే. వాటి అభివృద్ధికి నిధులు కేటాయిస్తే ఎంతో బాగుండేది.

– మల్లారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

వేతన జీవులకు నిరాశే మిగిలింది



కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో నూతనంగా ఒక్క వెసులుబాటు కూడా కల్పించలేదు. వేతన జీవులకు పూర్తిగా నిరాశనే మిగిలింది. కొత్త పన్నుల విధానంతో 80 (సీ) 80 (డీ) ఇంటి అద్దె, విద్యా, గృహ రుణాలపై వడ్డీ మినహాయింపులు చేయాలని మూడేళ్లుగా సంఘాలు కోరుతున్నా పట్టించుకోకపోవడం సరికాదు. ప్రత్యక్ష పన్ను పరిమితిని రూ. 10 లక్షలకు పెంచాలి.

– ప్రణీద్‌కుమార్, పీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం



నిత్యసిరిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: మెదక్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని నామ నిత్యసిరి అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఛాంపియన్‌షిప్‌తో పాటు బంగారు పతకం సాధించడం జిల్లాకే గర్వకారణమని అదనపు కలెక్టర్ రమేశ్ పేర్కొన్నారు. జనవరి 28న హైదరాబాద్‌లో జరిగిన అండర్–15 కరాటే బ్లాక్ బెల్ట్ పోటీల్లో 30 దేశాల నుంచి దాదాపు 3,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నుంచి నిత్యసిరి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. గురువారం అదనపు కలెక్టర్ రమేశ్ విద్యార్థినిని అభినందించారు.

79 మంది బాల కార్మికులకు విముక్తి

మెదక్ మున్సిపాలిటీ: ఆపరేషన్ స్మైల్–10 బృందం నిర్వహించిన దాడుల్లో 79 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించినట్లు ఎస్పీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. బట్టల షాపులు, ఆటో మొబైల్ షాపుల్లో బాల కార్మికులను గుర్తించినట్లు చెప్పారు. ఇందులో 14 మంది అమ్మాయిలు ఉండగా 65 మంది బాలురు ఉన్నట్లు వెల్లడించారు. పట్టుకున్న వారిని సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు. అనంతరం పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపర్చి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మల్లయ్య, శ్రీనివాస్, జిల్లా ఆపరేషన్ స్మైల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుణాల పంపిణీలో ప్రథమం



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ ఏపీడీ భీమయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): డ్వాక్రా మహిళలకు ఎంటర్‌ప్రైజెస్ రుణాల ఇవ్వడంతో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని డీఆర్‌డీఏ ఏపీడీ భీమయ్య తెలిపారు. గురువారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల ఐకేపీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 13,500 డ్వాక్రా సంఘాలు ఉండగా లక్షా 39 వేల మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. 6,590 మందికి రుణాలు ఇచ్చి రాష్టంలో మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు బ్యాంకు ద్వారా రూ. 491 కోట్ల రుణాలు లక్ష్యంగా ఉండగా ఇప్పటికే వందశాతం పూర్తి చేశామన్నారు. భవిష్యత్‌లో లోకోస్ యాప్ ద్వారానే లావాదేవీలు జరుపుతామని వివరించారు. కార్యక్రమంలో డీపీఎం జాన్‌కెనెడీ, స్త్రీనిధి ఆర్‌ఎం గంగారాం, డీఎల్ వెంకటేశ్వర్లు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ షురూ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన జనరల్ పరీక్షలకు మొత్తం 713 మంది హాజరు కావాల్సి ఉండగా 653 హాజరు కాగా 60 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ పరీక్షలకు 689 మంది హాజరుకావాల్సి ఉండగా 628 మంది హాజరయ్యారు. మరో 61 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

సమస్యలపై సంఘటితంగా పోరాడుదాం

టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్: సమస్యలపై సంఘటితంగా పోరాడి సాధించుకుందామని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. గురువారం పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో నీటిపారుదల శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతుల పంట పొలాలకు సాగునీరు అందించడంలో నీటి పారుదల శాఖ ఉద్యోగుల సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ ప్రకటించారు. అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీ హర్ష, సహాధ్యక్షుడిగా సత్యనారాయణ, కోశాధికారిగా గాంధీ బాబు తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఏఓ తోట కుమార్ నీల, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్ పాషా పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

డీఈఓ రాధాకిషన్



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న డీఈఓ రాధాకిషన్

రామాయంపేట(మెదక్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మూడు వేల మంది పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇచ్చే కార్యక్రమం ప్రారంభించామని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. గురువారం మండలంలోని అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సమీక్షించి స్నాక్స్ వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు కష్టపడి చదవి మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 10,300 మంది విద్యార్థులు ఈసారి పదో తరగతి పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు స్నాక్స్ కోసం కలెక్టర్ నిధులు విడుదల చేశారని వివరించారు.



వాహనదారులు, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అతి వేగం ప్రమాదకరం

తూప్రాన్: వాహనాలు అతివేగంగా నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని జిల్లా ఎంవీఐ కిస్టోఫర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో గురువారం డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనదారులు, డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ ఎస్‌ఐ– 2 యాదగిరితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటే..

మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్)/చిన్నశంకరంపేట: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ఆలోచన విధానాలు ఒకేలా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునందన్‌రావు ఆరోపించారు. గురువారం రామాయంపేటలో జరిగిన మెదక్ నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. 17 సీట్లు గెలిపిస్తేనే ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, తద్వారా రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం ప్రజలను బెదిరించడమే అవుతుందన్నారు. దేశం మొత్తం మోదీ గాలి వీస్తోందని, వచ్చే ఎన్నికల్లో నాలుగు వందల పైచిలుకు ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, నల్లాల విజయ్, నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయకుమార్, మెదక్ అసెంబ్లీ ఇన్‌చార్జి మధు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బెండె వీణ, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట బీజేపీ కార్యకర్తల సమావేశంలోనూ రఘునందన్‌రావు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు కేంద్రంలో చేసేదేమిలేదని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందని అన్నారు.

సమగ్ర సస్యరక్షణ తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



మాట్లాడుతున్న గోవింద్

చేగుంట(తూప్రాన్): జిల్లాలో ఎక్కువ శాతం వరి పంట వేస్తున్నందున సస్యరక్షణ చర్యలు పాటిస్తే దిగుబడులు పెంచుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లిలో గురువారం రైతులకు సమగ్ర సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వరినారు వేసుకున్న నాటి నుంచి కోతల వరకు పాటించే పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం రాష్ట్ర సస్యరక్షణ అధికారి సునీత మాట్లాడుతూ.. వ్యవసాయంలోని అన్నిరకాల పంటలపై సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి నిర్వహించే సస్యరక్షణకు ప్రాధాన్యం ఉండాలని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీకాంత్, సహ సస్యరక్షణ అధికారిణి నీలారాణి, రైతులు పాల్గొన్నారు.

పెళ్లి నిశ్చితార్థానికి వెళ్తూ..

- తండ్రీకొడుకుల దుర్మరణం
- 11 మందికి తీవ్రగాయాలు
- టైర్ పేలి టాటాఏస్ వాహనం పల్టీ
- చిన్నకోడూరు మండలంలో ఘటన

చిన్నకోడూరు(సిద్దిపేట): పెళ్లి నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో తండ్రి, కొడుకు దుర్మణం చెందగా, 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం జరిగిన విషాద ఘటన చిన్నకోడూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బాలాజీనగర్‌కు చెందిన మరియాల శ్రీనివాస్(60), అతని కుమారుడు హన్మంత్‌రావు (26), కుటుంబ సభ్యులతో కలిసి కూతురుకు పెళ్లి సంబంధం చూడటానికి టాటా ఏస్ ఆటోలో కరీంనగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని రామునిపట్ల శివారులో వారు ప్రయాణిస్తున్న వాహనం టైర్ ఒక్కసారిగా పేలిపోయి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. శ్రీనివాస్, అతని కుమారుడు హన్మంత్‌రావులకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాస్ భార్య విజయ, పెద్దకుమారుడు రమేశ్, కోడలు జ్యోతి, వారి పిల్లలు జయ్, రిషికేష్‌లు, డ్రైవర్ వీరభద్రం, భార్య పావని, కుమారుడు బాబు, బంధువులు కందుకూరి లక్ష్మయ్య, సరిత, సాయికిరణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సుభాష్ గౌడ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తీవ్రంగా గాయపడ్డ వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారికి వైద్యులు చికిత్సలు నిర్వహిస్తున్నారు. తండ్రి కొడుకుల మృతదేహాలను మార్చురీకి తరలించారు.



సంఘటనా స్థలంలో తండ్రీకొడుకుల మృతదేహాలు

జహీరాబాద్‌పై ఫోకస్!

- లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- మండల స్థాయి సమావేశాలతో బీజేపీ..
- యువతను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ క్రికెట్ పోటీలు
- సన్నాహక సమావేశాలను నిర్వహించిన బీఆర్‌ఎస్



జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఎలాగైన ఈ స్థానాన్ని తమ ఖాతాల్లో వేసుకునేందుకు అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. వివిధ కార్యక్రమాలతో ఇప్పటి నుంచే నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

కొన్ని నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘెర పరాజయం పాలైన బీజేపీ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను భిన్నంగా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఉంటాయనే ధీమాతో ఉన్న కమలం పార్టీ.. ఈ జహీరాబాద్ స్థానంపై కాషాయం జెండాను ఎగురవేయాలని ఉవ్విళ్లూరుతోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తోంది. మండలాల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తోంది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానాల పరిధిలో ఒక్కో రోజు మూడు, నాలుగు మండలాలకు వెళ్లి నాయకులతో సమావేశమవుతున్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించేందుకు ప్రచార రథాలు ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో తిప్పుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌తో పోల్చితే క్యాడర్ బీజేపీకి తక్కువే అయినప్పటికీ.. ఉన్నదానితోనే ఎన్నికలను ఎదుర్కోవాలని చూస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కేవలం 1.72 లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటాయని బీజేపీ భావిస్తోంది.

క్రికెట్ పోటీలు, హెల్త్ క్యాంపులతో కాంగ్రెస్..

ఇటు కాంగ్రెస్ పార్టీ కూడా జహీరాబాద్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అన్ని పార్టీల కంటే ఎక్కువ ఓట్లు సాధించింది. ఏడుగురు అభ్యర్థులకు కలిపి 5.48 లక్షల ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ కంటే సుమారు 18 వేల ఓట్లు అధికంగా ఓట్లు సాధించింది. ఇదే ఉత్సాహంతో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా విజయం సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న ఉజ్వల్‌రెడ్డి నియోజకవర్గంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నాడు. ఎన్నికల్లో కీలకమైన యువతను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. మరోవైపు సురేష్‌షెట్కార్ కూడా నియోజకవర్గంలో హెల్త్ క్యాంపులను నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా షెట్కార్ ఉంటారని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో ప్రకటించిన విషయం విదితమే.

హ్యాట్రిక్ కోసం బీఆర్‌ఎస్ ప్రయత్నాలు

సిట్టింగ్ పార్లమెంట్ స్థానం జహీరాబాద్‌పై మరోసారి గులాబీ జెండాను ఎగురవేసేందుకు బీఆర్‌ఎస్ సంసిద్ధమవుతోంది. ఇక్కడ రెండు పర్యాయాలు విజయం సాధించిన బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయి నిరుత్సాహంలో ఉన్న గులాబీ క్యాడర్‌లో జోష్ నింపే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పార్లమెంట్ స్థాయిలో ముఖ్యనేతలతో హైదరాబాద్‌లో సన్నాహక సమావేశం నిర్వహించిన గులాబీ పార్టీ.. ఇకపై అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పార్టీ క్యాడర్‌తో సమావేశాలు నిర్వహించాలని భావిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని జహీరాబాద్ అసెంబ్లీ స్థానంపై గులాబీ జెండా ఎగిరిన విషయం తెలిసిందే. మరోవైపు ఈ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ 5.30 లక్షల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు పావులు కదుపుతోంది.

క్లుప్తంగా

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేటరూరల్: మండల సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ఐదుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టుకు ఎంపికై నట్లు గురువారం టెస్ట్ నిర్వాహకులు తెలిపారు. మండల వ్యాప్తంగా 8 ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతికి చెందిన 16 మంది ఈ టాలెంట్ టెస్టులో పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 3వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీల్లో పాల్గొననున్నారు. ఇర్కోడ్ ఆదర్శ పాఠశాలకు చెందిన టీ.అశ్విని, రాఘవాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి చెందిన వెన్నెల వైష్ణవి, చిన్నగుండవెల్లికి చెందిన అంకిత, చింతమడకకు చెందిన లోహిత్, వంశీ జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సోషల్ ఫోరం ఉపాధ్యాయులు పద్మ, సబిత, ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జక్కపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

నర్సాపూర్ రూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నర్సాపూర్ మండలం జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పీడీ అశోక్ గురువారం తెలిపారు. జనవరి 31న మెదక్‌లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా 100 మీటర్ల రన్నింగ్ పోటీల్లో బాలికల నుంచి జీ.ప్రసన్న, బాలురు నుంచి జీ.వర్షిత్ మొదటి స్థానంలో నిలిచారు. 400 రన్నింగ్ పోటీల్లో బాలికల నుంచి జీ.దివ్య, బాలుర నుంచి హర్షవర్ధన్ మొదటి స్థానంలో గెలుపొందారు. 400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో శ్రీజ, భవ్యశ్రీ ద్వితీయ స్థానంలో గెలుపొందారు. లాంగ్ జంప్‌లో జై చరణ్ తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈ నెల 8, 9, 10వ తేదీల్లో భద్రాది కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యాంసుందరరావు



మాట్లాడుతున్న శ్యాంసుందరరావు

మద్దూరు(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీవీ శ్యాంసుందరరావు అన్నారు. గురువారం మండలంలోని బెక్కల్ గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం దేశానికి శ్రీరామరక్ష వంటిదని అన్నారు. కేంద్రంలో మూడోసారి ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అంకుగారి శశిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నలసాని భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి.. భలే రాబడి

"యాసంగిలో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. రెండు, మూడేళ్లుగా మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, కూరగాయల పంటలు వేసి లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ పంటలకు మంచి డిమాండ్ ఉంది. దీంతో వానాకాలం కంటే యాసంగిలోనే ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగు చేసి లాభాలు పొందుతున్నారు. తక్కువ నీటితోపాటు అధిక దిగుబడులు వస్తున్నాయని.. చీడ పీడల బెడద తక్కువగా ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు."

- యాసంగిలో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు సాగు
- తక్కువ నీటితో.. అధిక దిగుబడులు
- చీడపీడలు తక్కువేనంటున్న రైతులు
- వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు ..



చిన్నకోడూరులో సాగవుతున్న మొక్కజొన్న పంట

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోనే మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు 2 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. 800 ఎకరాల్లో మొక్కజొన్న, 1,200 ఎకరాల్లో పొద్దు తిరుగుడు సాగు చేస్తున్నారు. వానాకాలంతో పోలిస్తే చీడపీడల బెడద తక్కువగా ఉండడంతో ఆరుతడి పంటలు, కూరగాయల తోటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆరుతడి పంటలకు గిట్టుబాటు ధర రావడంతో వరి సాగును తగ్గిస్తున్నారు. ఎప్పటికప్పుడూ వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందుతున్నారు.

పొద్దు తిరుగుడు సాగు..

మిరుదొడ్డి(దుబ్బాక): మంచి శ్రేష్టమైన నూనెను అందించడంలో పొద్దు తిరుగుడు కీలక పాత్ర పోషిస్తుంది. పొద్దు తిరుగుడు గింజల నుంచి వచ్చే నూనెను వంటల్లో విరివిగా వినియోగిస్తుంటారు. అలాగే సబ్బులు, వార్నీష్‌లు, వనస్పతితోపాటు కలప పరిశ్రమల్లో పొద్దు తిరుగుడు నూనెను వినియోగిస్తారు. పొద్దు తిరుగుడు నుండి నూనెను తీయగావచ్చిన పిప్పిని పశువులకు దానాగా వినియోగించడానికి అవకాశాలు ఉన్నాయి. నీటి వనరులు ఉన్న ప్రతీ చోట పొద్దు తిరుగుడు ఏడాది పొడవునా సాగు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం నీటి పారుదల కింద ఫిబ్రవరిలో కూడా విత్తుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి మల్లేశం రైతులకు సూచనలు, సలహాలు చేశారు.



మిరుదొడ్డిలో పొద్దు తిరుగుడు సాగు

నేలలు, తయారీ విధానం :

- ఒండ్రు నేలలు, ఇసుక, రేగడి నేలలు అనుకూలంగా ఉంటాయి. ఎకరానికి 3 టన్నుల పశువుల ఎరువును వేసుకొని భూమిని నాలుగు లేదా ఐదు సార్లు మెత్తగా దున్నుకొని అనువైన బోదేలను ఏర్పాటు చేసి, సాగుకు సిద్ధం చేసుకోవాలి.
- పొద్దు తిరుగుడులో మోర్డన్, టీఎస్ఏయూ, ఎస్‌యూఎఫ్-7 రకాలు ఉంటాయి.

విత్తన మోతాదు :

- నీటి పారుదల కింద సాగు చేస్తే ఎకరానికి 2 కిలోలు, సంకర రకాలైతే 1.6 కిలోల విత్తనాలు సరిపోతాయి.
- ఎంచుకున్న విత్తనాలను సుమారు 14 గంటపాటు నానబెట్టి నీడలో ఆరబెట్టాలి. కిలో విత్తనానికి 2 నుంచి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి శుద్ధి చేసుకోవాలి.
- పొద్దు తిరుగుడులో వచ్చే బూజు తెగులు నివారణకు 6 గ్రాముల మెటలాక్సిల్ మందుతో విత్తన శుద్ధి చేసుకోవాలి.
- నేలలను బట్టి ఎకరానికి 22 వేల మొక్కల నుంచి 44 వేల మొక్కలు వచ్చేట్లుగా మొక్క మొక్కకు తగినంత దూరంలో విత్తుకోవాలి.

ఎరువుల వాడకం :

- నీటి పారుదల కింద ఎకరానికి నత్రజని 12 కిలోలు, భాస్వరం 36 కిలోలు, పొటాష్ 12 కిలోలు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.
- 30 రోజుల తర్వాత నత్రజని 6 కిలోలు, 45 రోజుల తర్వాత 6 కిలోల నత్రజని వేసుకోవాలి.
- పువ్వు మగ భాగం తెరుచుకున్నప్పుడు బోరాన్ పొడిని 2 గ్రా. లీటర్ నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

నీటి తడులు :

- రేగడి నేలల్లో 15 రోజుల వ్యవధిలో ఒకసారి, ఎర్ర నేలల్లో 8 నుంచి 10 రోజుల వ్యవధిలో నీటి తడిని అందించాలి. వేసవి కాలంలో తేలిక నేలలైతే 6 నుంచి 8 రోజులకు ఒకసారి అందించాలి.
- మధ్యస్థ నేలలైతే 4 నుంచి 5 రోజుల వ్యవధి, బరువు నేలలైతే 3 నుంచి 4 రోజుల వ్యవధిలో నీటి తడిని అందించాలి.

పువ్వు రుద్దే విధానం :

- పొద్దు తిరుగుడు సాగు పరపరాగ సంపర్కం ద్వారా గింజలు కట్టుకుంటాయి. అందుకు తేనెటీగలు ఎంతో దోహదం చేస్తాయి.
- తేనె టీగల సంఖ్య తగినంత లేకపోతే ఉదయం పూట 8 గంటల నుంచి 11 గంటల మధ్య తగినంత సున్నితమైన మెత్తని గుడ్డతో పువ్వులపై వలయాకారంలో రుద్దాలి.
- సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ సాగు చేయడం వల్ల మంచి ఆర్థికాదాయం సాధించడానికి పొద్దు తిరుగుడు ఎంతో దోహదం చేసే అవకాశాలు ఉన్నాయి.

చీడపీడలు తక్కువ..



వానాకాలంలో సాగు చేసే పంటలకంటే యాసంగిలో పండించే మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలకు చీడపీడల బెడద చాలా తక్కువగా ఉంటుంది. కూలీల కొరత ఉండదు. పందుల నుంచి పంటను కాపాడుకుంటే మంచి దిగుబడి వస్తుంది. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తున్నాం.

–యాట రాజు, రైతు మాచాపూర్

మంచి ఆర్థికాదాయం



నీటి వనరులు కలిగిన చోట తక్కువ ఖర్చుతో పొద్దు తిరుగుడు సాగుతో మంచి దిగుబడులు సాధించవచ్చు. సమయానుకూలంగా నీటి తడులు అందిస్తూ ఎలాంటి శ్రమ లేకుండా సాగుతో మంచి ఆర్థికాదాయం సమకూర్చుకోవచ్చు. గింజ దశలో పంటను పక్షుల బెడద నుంచి కాపాడుకోవడానికి మెరుపు రిబ్బన్లను పొలంలో ఏర్పాటు చేసుకోవాలి. నీటి వనరులు కలిగి ఉన్న చోట పొద్దు తిరుగుడు సాగు ఏడాది పొడవునా యాసంగి, ఖరీఫ్‌కు అనువుగా ఉంటుంది.

– మల్లేశం, మండల వ్యవసాయ అధికారి, మిరుదొడ్డి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

- ఆపరేషన్ స్మైల్‌లో 85 మందిని రెస్క్యూ
- సిద్దిపేట సీపీ అనురాధ



సిద్దిపేటకమాన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో 85 మందిని రెస్క్యూ చేసి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలో నెల రోజులుగా చైల్డ్ వెల్ఫేర్, కార్మిక, విద్యాశాఖ, వైద్యశాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ వివిధ శాఖల సిబ్బందితో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల పరిధిలో హోటళ్లు, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీల్లో బాల కార్మికులుగా పని చేస్తున్న పలు రాష్ట్రాలకు చెందిన 85 మంది పిల్లలను గుర్తించి వారి కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. బాల కార్మికులతో పని చేయించుకుంటున్న 9 మంది యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. 2023లో ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 60 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. బాల కార్మికులతో పని చేయించినట్లుగా గుర్తిస్తే డయల్ 100, పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 67100 కు సమాచారం అందించాలని తెలిపారు.

తహసీల్దార్, ఎంపీడీవోకు షోకాజ్ నోటీసులు

హవేళిఘణాపూర్(మెదక్): సర్పంచ్‌ల పదవీ కాలం గురువారంతో ముగియగా ఎంపీడీవో కార్యాలయంలో పొలిటికల్ నాయకులు వారికి వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీరామ్, తహసీల్దార్ నారాయణ హాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ సమావేశాలకు ఎలా వెళ్తారని గురువారం ఇద్దరికీ షోకాజ్ నోటీసులు అందజేశారు.

మధ్యాహ్న భోజనం.. అధ్వానం

- లోపించిన నాణ్యత
- ఇంటి నుంచి భోజనాన్ని తెచ్చుకుంటున్న విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించడంతో విద్యార్థులు ఇంటి నుంచి బాక్స్‌లు తెచ్చుకొని తింటున్నారు. ఈ సంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిత్యకృత్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోనే అత్యధికంగా కుకునూరుపల్లి ప్రభుత్వ పాఠశాలలో 370 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో ప్రతీ రోజూ మెనూను పాటించినా భోజనం రుచిగా లేకపోవడంతో సుమారు 20 నుంచి 30 మంది విద్యార్థులు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకెళ్తున్నారు. మరి కొందరు భోజనం రుచిగా లేదని బయట పడేస్తున్నారు. వారంలో రెండు మార్లు మాత్రమే గుడ్డును ఇస్తున్నారని, ఇదేంటని నిర్వాహకులను అడిగితే మాకు బిల్లులు సరిగా రావడంలేదంటూ బెదిరిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎం సత్తయ్యను దృష్టికి తీసుకెళ్లగా కొందరు విద్యార్థులు వివిధ కారణాలతో ఇంటి నుంచి భోజనాన్ని తెచ్చుకుంటున్న విషయం వాస్తవమేనన్నారు. భోజనం రుచిగా ఉండడం లేదనే విషయం తన దృష్టికి రాలేదని అలా జరగకుండా చూస్తామన్నారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలి



విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న అక్షయ్‌కుమార్

పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అక్షయ్‌కుమార్

గజ్వేల్‌రూరల్: వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ ఇంజినీర్లుగా తీర్చిదిద్దిన గజ్వేల్ (జీఎంఆర్) ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అక్షయ్‌కుమార్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో గల జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1988లో రాష్ట్రంలోనే ఏకైక ఎస్సీ బాలుర ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 35 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులను ఇంజినీర్లుగా తీర్చిదిద్ది ప్రయోజకులను చేసిందని గుర్తు చేశారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ అడ్మిషన్లు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్న తరుణంలో గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యారంగంలో రాణించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థుల కోరిక మేరకు సొంత ఖర్చులతో మైక్ సెట్ బాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదివి కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఉపాధ్యాయులు రాచకొండ భూపాల్, దయా సాగర్‌రెడ్డి, శ్రీనివాస్, వినయ్, ప్రకాశ్, రవి, శేఖర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మైక్ సెట్ అందిస్తున్న వెంకటయ్య

అతిగా మద్యం సేవించి..

వ్యక్తి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): అతిగా మద్యం సేవించి వైన్స్ షాప్ ఎదుటే వ్యక్తి మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన గోవిందరాజ్ బార్ (32) స్థానికంగా ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది అన్నారంలోని వైన్స్ షాపు ఎదుట మద్యం సేవించి పడి ఉన్నాడు. ఎంతకీ లేవకపోవడంతో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

జహీరాబాద్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జహీరాబాద్ మండలంలోని హోతి(బి) గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేశ్(34) అదే గ్రామానికి చెందిన మనోజ్ పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. ఇందుకు రూ.3.50 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే దారిలేక మనస్తాపం చెంది కౌలుకు తీసుకున్న పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

సంగారెడ్డి టౌన్: మద్యం మత్తులో యువకుడు హల్‌చల్ చేసిన ఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి సంగారెడ్డి ఆర్టీసీ బస్సులో వచ్చిన యువకుడు సంతోష్ కుమార్ పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో దిగి సమీపంలోని వైన్స్ వద్ద మద్యం సేవించాడు. గురువారం సాయంత్రం పట్టణ ట్రాఫిక్ పోలీసులు అక్కడే వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న యువకుడు పోలీసులు విధులు నిర్వహిస్తుండగా వీడియో తీశాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడి ఫోన్ లాక్కున్నాడు. ఫోన్‌లో వీడియోలు ఎందుకు తీస్తున్నావంటూ అనడంతో ఇద్దరి మధ్య కొద్ది సేపు వాగ్వాదం నెలకొంది. ఈక్రమంలో మద్యం మత్తులో యువకుడు పక్కనే ఉన్న బంక్‌లో పెట్రోల్ కొనుగోలు చేసి ఒంటిపై పోసుకొని నిప్పు అట్టించుకున్నాడు. గమనించిన పోలీసులు చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి డీఎస్పీ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న ఇద్దరినీ ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన అల్లాదుర్గం మండలం నడిమితండా శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అల్లాదుర్గం మండలం నడిమితండా శివారులో తండాకు చెందిన మోతిలాల్, విజయ్‌కుమార్ గంజాయి సాగు చేస్తున్నారు. నమ్మదగ్గ సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి అబ్దుల్ రజాక్, సీఐ నరేందర్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఇందులో 13 గంజాయి మొక్కలు అక్రమంగా సాగు చేస్తుండగా పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

బావను పొడిచిన బామ్మర్ది

మనోహరాబాద్(తూప్రాన్): బావను బామ్మర్ది కత్తితో పొడిచిన ఘటన మనోహరాబాద్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కూచారం గ్రామానికి చెందిన బోంతపల్లి అరుణ్, కామారెడ్డి జిల్లా దేవునిపల్లి గ్రామానికి చెందిన శ్యామలకి రెండేళ్ల కిందట ప్రేమ వివాహమైంది. కొన్ని రోజులు సజావుగా సాగిన వీరి కాపురంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో శ్యామల తల్లిగారింటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో బావపై బామ్మర్ది శ్యాంసుందర్ కోపం పెంచుకున్నాడు. తన స్నేహితులైన అఫ్రోజ్, చేతన్‌తో కలిసి ఈ నెల 30న కూచారం గ్రామ శివారులో బావ అరుణ్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన అరుణ్‌ను చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించారు. హత్యాయత్నం చేసిన శ్యాంసుందర్, అతడి స్నేహితులపై పోలీసులు కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

పల్లెల్లో ప్రత్యేక పాలన

- నేటి నుంచి ప్రారంభం
- జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు
- ఉన్నత స్థాయి ఉద్యోగుల నియామకం
- గురువారం సాయంత్రానికే గ్రామాల్లో రిపోర్టు

సిద్దిపేటరూరల్: గ్రామ పంచాయతీల్లో నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. ఐదేళ్ల పాటు కొనసాగిన సర్పంచ్‌లు గురువారం పదవీకాలం పూర్తి చేసుకొని వీడ్కోలు పొందారు. గతంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసేలోపు మళ్లీ ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేసేది. ఈసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎలాంటి నిర్ణయం లేకపోవడంతో పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఉన్నత స్థాయి ఉద్యోగులను ఎంపిక చేసి గ్రామాలకు ప్రత్యేకాధికారులను కేటాయించింది. గురువారం సాయంత్రం వరకు జీపీల్లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు జారీ చేయగా అధికారులు వారివారి గ్రామాలకు చేరుకొని రిపోర్టు చేయడంతో పాటుగా రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

499 గ్రామాలకు ప్రత్యేకాధికారులు..

జిల్లా వ్యాప్తంగా 26 మండలాలు ఉండగా 499 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, మండల వ్యవసాయశాఖ, ఎంపీఓలతోపాటు వారి స్థాయికి సమానమైన వారిని, అంతకంటే ఎక్కువ స్థాయి కలిగిన అధికారులను ప్రత్యేకాధికారులుగా ఎంపిక చేసింది. ప్రత్యేకాధికారులతోపాటు మండలానికి ఒక్కరు చొప్పున పర్యవేక్షణా ప్రత్యేకాధికారిని నియమించినట్లు అధికారులు తెలిపారు.



రాఘవాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

చెక్ పవర్ రద్దు

సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను గురువారం తొలగించారు. గ్రామానికి కేటాయించిన ప్రత్యేకాధికారితోపాటు కార్యదర్శి జాయింట్ చెక్ పవర్‌లో కొనసాగనున్నారు. ఈ మేరకు కార్యదర్శులు సర్పంచ్, ఉపసర్పంచ్‌ల వద్ద ఉన్న డిజిటల్ కీలను స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు అందించారు.

అధికారులకు అవగాహన..

ప్రత్యేకాధికారుల పాలన కావడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకాధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రధానంగా పారిశుధ్య, తాగునీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పూర్తిగా పర్యవేక్షించనున్నారు. కార్యదర్శిని సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగించనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి



గ్రామాల్లో నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. అధికారులు అవగాహన కలిగి ఉన్నందున ప్రజలకు ఇబ్బంది లేకుండా పాలన జరిగేలా చర్యలు తీసుకుంటాం. సర్పంచ్‌ల నుంచి కార్యదర్శులు అన్ని రికార్డులు స్వాధీనం చేసుకొని డిక్లరేషన్ పొందారు. గ్రామాలకు అధికారులు చేరుకున్నారు. నేటి నుంచి పూర్తి స్థాయిలో పాలన కొనసాగుతుంది.

జిల్లా పంచాయతీ అధికారి, దేవకీదేవి